గులాబీమయమైన వనపర్తి

■ మంత్రి నిరంజన్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టిన ప్రజలు

వనపర్తి , నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లా కేంద్రం గులాబీమయమైంది. మంగళవారం జిల్లాకేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రోడ్ షో నిర్వహించగా జై కేసీఆర్, జై తెలంగాణ, నినాదాలతో హోరెత్తింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉన్నత విద్యావంతులకు నిలయమైన వనపర్తిలో కాంగ్రెస్ అభ్యర్థి ఇంటర్ వరకు విద్యాభ్యాసం, 420కేసు పెండింగ్‌లో ఉండని తన అఫిడవిట్‌లో సూచించిన అంశాలను ఉన్నత విద్యావంతులు ఆలోచించాలని మంత్రి కోరారు. ఎన్నికల్లో డబ్బులు పంచే వారికి కాకుండా అభివృద్ధి చేసిన వారికే ఓట్లు వేసి అండగా నిలబడాలని మాజీఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రోడ్ షోలో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, నాయకులు సయ్యద్ ఇబ్రహీం, పురుషోత్తంరెడ్డి, కురుమూర్తి యాదవ్, ప్రజలు భారీగా తరలొచ్చారు.

వనపర్తిలో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన జనం

రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల, రోడ్‌షోకు భారీగా హాజరైన జనం

నాగర్‌కర్నూల్‌లో హాజరైన ప్రజలు



మల్రి విజయ ధరహాసం

కేసీఆర్ పాలనలో తెలంగాణ స్వర్ణయుగం

మక్తల్ టౌన్, నవంబర్ 28 : కేసీఆర్ పాలనలో తెలంగాణ స్వర్ణయుగమైందని మక్తల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మక్తల్ కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి రోడ్ షో నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రజలకు అభివాదం చేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ రోడ్‌షో నందినినగర్, యాదవ నగర్, మారుతీనగర్, నేతాజీనగర్, గాంధీ చౌక్, రెడ్డి నగర్, ఆజాద్‌నగర్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ 58ఏండ్లలో చేయని అభివృద్ధిని కేసీఆర్ పదేండ్లలోనే చేసి చూపించారని తెలిపారు.

మక్తల్‌లో రోడ్‌షోకు భారీగా హాజరైన జనం.. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పాలమూరు.. జనహోరు

మహబూబ్‌నగర్, నవంబర్ 28 : పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపానని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం న్యూటౌన్ నుంచి క్లాక్‌టవర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్వయంగా బైక్‌ను నడిపి క్లాక్‌టవర్‌కు చేరుకుని కార్నర్ సమావేశంలో మాట్లాడారు. కుట్ర చేసి రైతుబంధును ఆపి అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ప్రతి పక్షాల కుట్రలను మహబూబ్‌నగర్ ప్రజలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. రౌడీ షీటర్లను వెనుక పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ వాళ్లు తిరుగుతున్నారని, కుల రాజకీయాలు చేస్తూ బీజేపీ నాయకులు తిరుగుతున్నారని తెలిపారు.

మహబూబ్‌నగర్‌లో హాజరైన జనం

కాంగ్రెస్‌ను నమ్మితే తెలంగాణ ఆగమైతది

■ జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్లటౌన్, నవంబర్ 28 : కాంగ్రెస్ నాయకుల మోసపూరిత మాటలను నమ్మొద్దని, టికెట్లు అమ్ముకొన్న కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని సైతం అమ్మేస్తారని జడ్చర్ల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్లలో బుధవారం నిర్వహించిన రోడ్‌షోకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో జనసంద్రోహంగా మారింది. జై కేసీఆర్, జై లక్ష్మారెడ్డి నినాదాలతో హోరెత్తించారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌తో కలిసి లక్ష్మారెడ్డి రోడ్‌షో పాల్గొన్నారు. గ్యారెంటీ లేని కాంగ్రెస్ పార్టీని ఎవరూ నమ్మొద్దని, పొరపాటున కాంగ్రెస్ పార్టీ గెలిస్తే కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఆగం చేస్తారని చెప్పారు.

జడ్చర్లలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రోడ్‌షోకు భారీగా హాజరైన జనం

కృష్ణా జలాలతో సస్యశ్యామలం

■ నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, నవంబర్ 28 : నియోజకవర్గానికి కృష్ణాజలాలను తీసుకొచ్చి రైతుల పాదాలు కడిగుతానని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. రోడ్ షోకు ప్రజలు భారీగా తరలివచ్చారు. బీఆర్ఎస్‌కు మద్దతుగా నినాదాలతో హోరెత్తించారు. పదేండ్లలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఎమ్మెల్యే కోరారు.

కొలాపూర్ రోడ్‌షోకు తరలివచ్చిన జనం. మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం

గద్వాల కోట బండ్లకు గెలుపు బాట

■ గద్వాల రోడ్‌షోలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు

■ జనసంద్రమైన జిల్లా కేంద్రం

గద్వాల, నవంబర్ 28: ప్రచారం చివరి రోజులో భాగంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం గద్వాలలో రోడ్ షో నిర్వహించారు. కిష్టారెడ్డి బంగ్లా నుంచి ప్రారంభమైన రోడ్ షో గాంధీచౌక్ మీదుగా పాతబస్‌స్టాండ్‌కు చేరుకోగా పట్టణంలోని వీధులన్నీ జనసంద్రమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల బిడ్డలు పౌరుషం గలవారని, పరాయి వ్యక్తులొచ్చి ఇక్కడ పెత్తనం చేస్తామంటే సహించరని స్పష్టం చేశారు. ''గత ఎన్నికల్లో నా విజయానికి మీరు కారణమయ్యారు. 2018 ఎన్నికల్లో మీరు ఆశీర్వదించడం వల్లే ఎమ్మెల్యేనయ్యా. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నా. మా బలం, బలగం మీరే'' అని పేర్కొన్నారు. రోడ్ షోలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, వైస్‌చైర్మన్ బాబర్, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్తకోట రోడ్‌షోకు హాజరైన జనం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల

కొత్తకోట కోలాహలం

కొత్తకోట, నవంబర్ 28 : కొత్తకోట మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నిర్వహించిన రోడ్ షో జనహోరును తలపించింది. రోడ్‌షోకు భారీగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కావడంతో హాజరు కావడంతో సక్సెస్ అయ్యింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ చదువుకున్న సంస్కారం లేకుండా ఇతరుల గురించి ఏ విధంగా మాట్లాడాలో తెలియని సంస్కార హీనుడు కాంగ్రెస్ అభ్యర్థి జీఎంఆర్ అని దుయ్యబట్టారు. ఇతరులను ఏ విధంగా గౌరవించాలో తెలియని వ్యక్తి కాంగ్రెస్ అభ్యర్థి అని, అదే నేను నోరు తెరిచానంటే చౌరస్తాలో చిద్విత్ స్తంభానికి ఉరేసుకుంటావని అన్నారు. సమావేశంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంతమౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్పర్సన్ సుకేశిని, ప్రదీప్‌కుమార్‌గౌడ్, బాలమణెమ్మ, విశ్వేశ్వర్, ప్రశాంత్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కదిలిన కందనూలు

■ రోడ్ షోలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి దంపతులు

నాగర్‌కర్నూల్, నవంబర్ 28 : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్‌షోకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దాదాపు కిలోమీటరు పొడవునా కొనసాగిన ర్యాలీలో యువకులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే సతీమణి మర్రి జయునారాణి, సీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, నాగం శశిధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాబురావు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో భారీ బైక్ ర్యాలీ

కల్వకుర్తి, నవంబర్ 28 : ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజైన మంగళవారం సాయంత్రం పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు తల కొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లోనూ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రోడ్‌షోలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ చైర్మన్ శ్రీశైలం, బీఆర్ఎస్ నాయకులు బావండ్ల మధు, రుక్కులు, షాహిద్, మనోహర్‌రెడ్డితోపాటు ఆయా మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అలంపూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ చల్లాకు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

గులాబీమయంగా అచ్చంపేట

■ ఎమ్మెల్యే గువ్వల రోడ్‌షోకు భారీగా హాజరైన జనం

అచ్చంపేట, నవంబర్ 28: ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజైన మంగళవారం సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టీచర్స్ కాలనీ ఎమ్మెల్యే నివాసగృహం నుంచి మసీద్ వరకు ర్యాలీ నిర్వహించారు. పట్టణం మొత్తం గులాబీమయంగా మారింది. మహిళలు భారీగా పాల్గొన్నారు. గువ్వల సతీమణి అమలతో కలిసి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రోడ్‌షోలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు మనోహర్‌గౌడ్, ఎన్నికల ఇన్‌చార్జి ఇంతియాజ్, మున్సిపల్ చైర్మన్ నరసింహగౌడ్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ అరుణ, స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విజయ ధరహాసం చూపుతున్న గువ్వల

అచ్చంపేటలో గువ్వల బాలరాజు రోడ్‌షోకు ర్యాలీగా వస్తున్న ప్రజలు

కొల్లాపురం.. జనసంద్రం

కొల్లాపూర్, నవంబర్ 28 : అసెంబ్లీ ఎన్నికల ప్రచార ఘట్టం ముగింపు సందర్భంగా మంగళవారం సాయంత్రం కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడంతో కొల్లాపూర్ మొత్తం జనసంద్రంగా మారింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్‌రావు, డాక్టర్ కురుమ విజయ్‌కుమార్‌తోపాటు ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం

■ అలంపూర్ రోడ్‌షోలో పాల్గొన్న ఎమ్మెల్సీ చల్లా

అలంపూర్, నవంబర్ 28 : మంగళవారం అలంపూర్‌లో గులాబీ దండు కదిలింది. పట్టణంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించగా జై కేసీఆర్, జై తెలంగాణ, జై చల్లా, జై విజయుడు నినాదాలతో పట్టణం హోరెత్తింది. పూలమాలలు, శాలువాలతో చల్లాను ప్రజలు సత్కరించారు. అక్కచెల్లెళ్లు ఆంజనేయస్వామి ఆలయం, దర్గాలో చల్లా ప్రార్థనల అనంతరం రోడ్ షోలో పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి విజయుడిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రోడ్ షోలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి, అలంపూర్ మున్సిపల్ చైర్పర్సన్ మనోరమ, వైస్‌చైర్మన్ శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలొచ్చారు.